స్పీడ్ పెంచాడు హీరోలా. అంత ధైర్యం ఎలా వచ్చిందో తనకే తెలియలేదు సుభాష్‌కు. చాలా స్పీడుతో ఆ ఎర్ర కారుని చేరుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. అతని బుర్రనిండా అంతులేని ఆలోచనలు. ఆ స్త్రీని రక్షించి వాడికి మంచిబుద్ధి చెప్పాలి. తనపేరు పెద్ద పెద్ద అక్షరాలతో పేపరు ముందు పేజీలో పడాలి. ఆస్త్రీ- అదే తాను రక్షించిన స్త్రీ సినిమాలో హీరోయిన్‌లా ఆమెను పెండ్లాడమని తన చెంతకువచ్చి ప్రాధేయపడాలి. ఇవీ సుభాష్ ఆలోచనలు. కారు శరవేగంతో పోతోంది. ఇక లాభం లేదని తన బుల్లెట్‌ను అడ్డదారిన పోనిచ్చాడు సుభాష్ తెలివిగా. కారుకంటే వేగంగా పోనిచ్చి ఆ కారుకు అడ్డుగా నిలిపాడు తన బుల్లెట్‌ను సుభాష్. కారు సడన్ బ్రేకుతో ఆగింది. సుభాష్ విజయగర్వంతో "ఏరా బుద్ధిలేదూ ఒకఆడ.." అనే సరికే. "అడ్డులేవోయ్ ముందు. ఇవతల ఈవిడకు నొప్పులొస్తున్నాయని ఆసుపత్రికి తీసుకెళుతుంటే మధ్యలో ఏమిటి నీ వెధవ గోల. తప్పుకో." అని కారును బుల్లెట్ ప్రక్కనుంచి విసురుగా పోనిచ్చాడు డ్రైవర్. అప్పుడే ఆ కారులో ఒక స్త్రీ బాధతో మెలికలు తిరిగిపోతూండటం చూశాడు సుభాష్.

ఇక నోరెళ్ళబెట్టడం సుభాష్ వంతైంది. ❁

---

## ఔను! నిజం!

మా పురుషత్వం
వ్యభిచరించాలనుకుంటే —
కొనుక్కుంటుంది.
'సంసారం' చేయమంటే —
అమ్ముడుపోతుంది.

— నెల్లుట్ల జగన్

---

ఓ డి. ఇ. వో.గారికి రోజూ పచ్చిమిరపకాయ బజ్జీలు తినడం బాగా అలవాటు.




ఓ రోజు అలా తిని వస్తూ తోవలో కనబడ్డ ఓ స్కూల్లో జొరబడి హఠాత్తుగా ఇన్‌స్పెక్షన్ మొదలెట్టాడు అయితే పక్క క్లాసులో నుంచి విపరీతమైన గొడవ వినబడుతూండేసరికి, కోపంగా ఆ క్లాసులోకి నడిచి అక్కడ గట్టిగా అరుస్తున్న ఓ కుర్రాడిని చొక్కా పట్టుకొని లాక్కొచ్చి తనకుర్చీ పక్కనే గోడకుర్చీ వేయమన్నాడు.

"అదికాదండీ! నేను...." అంటూ ఏదో చెప్పబోయాడా కుర్రాడు.

"నోర్మూసుకో! మాట్లాడావంటే పళ్ళు రాలగొడతాను." అన్నాడాయన.

"నేను.... చెప్పేది.... కొంచెం...."

ఇలా లాభం లేదని ఆ కుర్రాడి గూబ గుయ్‌మనిపించాడు డి. ఇ. వో.

"నోర్మూసుకొని ముందు గోడకుర్చీ వేస్తావా. లేదా?" అన్నాడు మళ్ళీ చెయ్యి లేపుతూ.

ఆ కుర్రాడు గోడకుర్చీ వేశాడు. కాసేపటి తర్వాత మళ్ళీ ప్రక్క క్లాసులోకి నడిచారాయన.


ఆ క్లాసు కుర్రాళ్ళు అందరూ ఆయనను చూడగానే లేచి నిలబడ్డారు

"కూర్చోండి! ఇంతకూ మీ టీచరేడీ?" అడిగాడాయన

కొద్ది నిమిషాల నిశ్శబ్దం తరువాత ఓ గొంతు నెమ్మదిగా అంది. "ఇందాక మీరు కాలర్ పట్టుకొని లాక్కుపోయింది మా టీచర్నేనండి!" ❁


---

ప్రయాణాలు మనిషికి జ్ఞానాన్ని యిస్తాయని ఒక ఆంగ్ల కవి అన్నారు.




అనుభవంమీద అది నిజమే అని తెలిసింది.

నేను తరచుగా ప్రయాణాలు చేస్తూ



వుంటాను. ఒక్కొక్కసారి ప్రయాణం ఒక్కొక్క అనుభవం. రెండు చిన్న సంఘటనలు మాత్రం చెప్తాను:

ఇరవై సంవత్సరాల క్రితం నాకు చాలా చిన్న వయస్సులో వేసంగి సెలవులకి మా తాతగారి వూరు వెళ్తున్నప్పుడు మా కంపార్టుమెంటు క్రిక్కిరిసి వుంది. అందులోకి ఒక ముసలావిడ చేతిలో గుడ్డ సంచీని గుండెలకి ఆనించుకొని ఎక్కి. కూర్చుంటానికి సీటులేక నానా గోల చేసింది. "ఏం చేస్తావమ్మా. క్రింద కూర్చో !" అని ఎవరో అన్నారు. 'అత్తెరికే ! నేను భద్రాచలం వెళ్ళి రాములవారి తీర్థం తీసుకొస్తున్నాను- నన్ను మీ కాళ్ళ దగ్గర కూర్చోమంటారా?' అని పెద్ద దెబ్బలాట వేసుకొంది. మేము పిల్లలం వినోదంతో 'భద్రాచలం' అని గేలిచేశాం. అంత దెబ్బలాడి మనిషి చివరకి క్రిందే కూర్చుని వొళ్ళో సంచి పెట్టుకుని మూటవిప్పి అందరికీ ప్రేమగా తను ఇంటి నుంచి వండి తెచ్చుకొన్న జంతికల పొట్లాన్ని పెట్టింది.

ఆ దెబ్బలాటకీ. ఈ ప్రేమకీ సామ్యం వుందా? ఆ వయస్సులోనే కాదు. ఇప్పుడూ నాకు ఆ విభిన్న మనస్తత్వం ఆశ్చర్యమే.

మొన్న బెంగుళూరు వెళ్ళే బృందావనాన్ని మద్రాసులో ఎక్కాం- నేను మా శ్రీవారు. ఆయన స్నేహితులు రావడం వల్ల ప్లాట్ ఫారమ్ మీదే వున్నారు. పోర్టరు మా సామానులని ప్రక్క సీటు క్రింద పెట్టి వెళ్ళిపోయాడు.

ఒక అరవై సంవత్సరాలావిడ వచ్చి తన సీటు క్రింద నా సామానులని చూసి నానాగోల చేసింది. అరవంలోనూ, ఇంగ్లీషులోనూ నాకు చెప్పింది. నేను సారీ చెప్పి "ఓ ఐదు నిమిషాలు వుండండి మా వారు వచ్చిన తరువాత వాటిని మూవ్ చేస్తారు" అని చెప్పాను దానికి ఆమె కొంచెం కూడా మర్యాద యివ్వకుండా విసుక్కుంటూనే వుంది. పదిహేను రోజుల క్రితం రిజర్వు చేశాను. కొంచెం కూడా మర్యాద లేనివాళ్ళు అంటూ రెండు భాషల్లోనూ అనసాగింది. ఆ రెండు భాషలు నాకు తెలుసు చివరకి విసిగి "ఎడ్యుకేటెడ్ వుమన్ మాదిరిగా వుండీ యిలా వోర్పులేకుండా ప్రవర్తించడం మర్యాదకాదు" అన్న తరువాత వూరుకొంది.

బండి బయలుదేరిన తరువాత నేనే మాటల్లో "ఏం చదువుకొన్నారు" అని అడిగాను. "చెప్పినా నీకు అర్థంకాదు" అంది. నేను నిర్ఘాంతపోయాను. బొత్తిగా పల్లెటూరి దానిలా లేనుకదా ! అంత గర్వంగా అందేం అనిపించింది. పోనీ చెప్పండి అన్నాను. ఆమె తన కథ యిలా చెప్పుకొంది: న్యూయార్కులో బిజినెస్ లా చదివిందట. బొంబాయిలో ఒక పెద్ద గవర్నమెంటు కంపెనీలో మానేజరుగా చేసి రిటైయిర్ అయిందట. పింఛను ఒక టిన్నర వెయ్యి వస్తుందట." అని— చెప్పింది.

"మీ కెంతమంది పిల్లలు" నే నడిగాను.

"స్టిల్ అ యామ్ అన్ మా రీడ్" అంది.

"స్టిల్" అనే పదం యెందుకు వాడినట్లు?

ఆమెకు అవకాశంవస్తే యిప్పుడు పెండ్లి చేసుకుంటుందా ?

మద్రాసు యెందుకొచ్చారు ?

ఆమె బొంబాయిలోనే సెటిల్ అయిపోయిందట. అక్కడ ఆమె పేరుమీద అన్నదాన సమాజం ప్రారంభించినదట, రోజూ అన్నదానం జరుగుతుందట. అన్నపిల్లల మీద దావా వేయడానికి వచ్చిందట.

"మీకెలానూ పిల్లలు లేరుకదా ! మీ అన్న పిల్లలకేగా" అని నేను అడిగితే

"అయితేమాత్రం, నా ఆస్తిని నేను తీసుకొని అన్నదానసమాజానికి యిస్తాను. అన్ని దానాలలోకి అన్నదానం చాల గొప్పదికదా" అని అన్నది.

ఆమెతో ఆమె వరుసకి తమ్ముడు తోడు వచ్చారు. ఆయనకి ఓ అరవై వుంటుంది. ఆమె "తంబీ నీవు సోడాతాగు, నాకు సోడా పడదు" అని తను లిమ్కా తాగి తమ్ముడికి మామూలుసోడా యిప్పించింది.

తమ్ముడికి తనతో సమానంగా కూల్ డ్రింకు యిప్పించలేనావిడ నిత్యం అన్నదానం చేస్తుందా ?

ఆమెను విడిపోయినా నాకు నమ్మకం కలగని విషయం అదే.

ఇలా యెంతో విభిన్న మనస్తత్వాలు గలవారు యెంతోమంది ప్రయాణాలలో తారసపడుతూ వుంటారు.

ప్రపంచమే ఒక పాఠశాల.

## చైతన్యం

అగ్గిపులని
సబ్బుబిళ్ళని చూసి
సిగ్గుపడు నేస్తం !
కారణం ?
పట్టి రాస్తే కోపంతో
కళ్ళెర్రజేస్తుంది అగ్గిపుల్ల
మురికి కనిపిస్తే
ఓ పట్టు పట్టేస్తుంది సబ్బుబిళ్ళ.

—ఆదిభట్ల రామప్రసాద్

